
*ఈ కథ నా అంతరాంతరాలలో అనేక ఏళ్లుగా దాగిన దుఃఖం. ఎదురు కాల్పుల్లో చనిపోయిన ఆ ఇద్దరు పిల్లలతో, ఆఖరుసారి మాట్లాడిన పంపిన దాన్ని నేనేనన్న దిగులు నన్నెటికీ వదిలిపోదు. మానేటి ఏటి ఒడ్డున, మామిడిచెట్ల మధ్య మండుతున్న వారిద్దరి చితిమంటల వేడి నాకింకా తాకుతూనే ఉంది.*

విమల

5

# కొన్ని నక్షత్రాలు కాసిన్ని కన్నీళ్లు





ఆటోవాడికి డబ్బులిచ్చేసి, ఆదరాబాదరా పరుగెత్తా. వేములవాడ వెళ్ళే బస్సు అప్పుడే బయలుదేరబోతోంది. ఖాళీగానే వుంది. బ్యాగ్ పైన పెట్టి, సీట్‌లో కూర్చుని చుట్టూ చూశా. ఇద్దరు వయసుమళ్ళిన భార్యా భర్తలు. వాళ్ళ మనువడు కాబోలు ఏదో కొనిపెట్టమని తెగ సతాయిస్తు న్నాడు. గొంగడి భుజాన వేసుకున్న ముసిలాయన అదే పనిగా దగ్గు తున్నాడు. చుడీదార్ వేసుకున్న ఓ పిల్ల చెవుల్లో ఇయర్ ఫోన్స్ పెట్టుకుని ప్రపంచంతో పనిలేనట్టు కూర్చుంది. ఏదో ఒకటి తినాలి, లేకపోతే నీరసం వచ్చేస్తుంది. బండి స్టార్ట్ కాబోతూ వుంటే, డ్రైవర్‌ని బ్రతిమలాడి, గబగబా దిగి, అవ్వాల్టి పేపర్లు ఓ బిస్కట్ ప్యాకెట్ తెచ్చుకున్నా. బస్సు బయలుదేరింది.

కిటికీలోంచి చూస్తూ వుంటే నిజామాబాద్, నిర్మల్, సిద్ధిపేట, గోదావరిఖని. ఒక్కో బస్సు పోతూ వుంటే, నా జ్ఞాపకాల పెట్టె నుండి ఒక్కో సీతాకోకచిలుకా ఎగిరిపోతున్నట్టు. సీతాకోకచిలుకా... గాయపడ్డ చిలుకా... సన్నటి నవ్వేదో పెదవులపైకి పాకింది.

ఉదయపు చల్లటి గాలి హాయిగా తాకుతోంది. మళ్ళీ పన్నెండేళ్ళ తరువాత వెడుతున్నా వేములవాడకి, పాతమిత్రుడి కూతురు పెళ్ళికి. ఎవరైనా కలుస్తారేమో... గత కాలపు మిత్రులు మళ్ళీ... ఎలా గడిచి పోయాయి కొన్నేళ్ళు. ఒక ప్రపంచం నుండి మరో ప్రపంచానికి. ఏదీ ఆ మరో ప్రపంచం- ఎఱ్రబావుటా నిగనిగలు, ప్రళయఘోషలు, ఝంఝా మారుతాలు, జగన్నాథ రథచక్రాలు, ఆకాశపుటెడారిలో కాళ్ళు తెగిన ఒంటరి ఒంటెలా... జాబిల్లా? నేనా? ఏవి, ఏవి తల్లీ నిరుడు కురిసిన హిమ సమూహాలు- తల విదిలించుకున్నా. ఆలోచనల జడివాన- నీటి చుక్కల్లో, రాలిపడి ఆవిరైపోతుందేమో నని.

అవ్వాల్టి పేపర్లు చదివేందుకు ప్రయత్నించి, అవే వార్తలు, ఆరోపణలు- వార్తల స్థానంలో కాకమ్మ కథలు. విసుగ్గా పక్కన పెట్టాను. సిద్ధిపేట పాత బస్‌స్టాండ్‌లో చాలామందే ఎక్కారు. ఎవరో భార్యా భర్తలు- ఇద్దరు పిల్లలు- పెద్దవాడికి పదిహే నేళ్ళుంటాయేమో- పాప ఎనిమిది, తొమ్మిదేళ్ళది. ఎక్కడా చోటు లేకపోతే, కొద్దిగా జరిగి పాపకి చోటిచ్చా.

తంగెళ్ళపల్లి- బస్సు మెల్లిగా మానేరు వాగు దాటుతోంది. నేను అప్రయత్నంగా కళ్ళు మూసుకున్నాను. వెచ్చటి కన్నీరు నా చెక్కిలిపై జారటం తెలుస్తూనే వుంది. కళ్ళద్దాలు తీసి తుడుచుకున్నట్లుగా, మెల్లిగా కళ్ళు తుడుచుకుని, చుట్టూ చూశా. ఎవరూ నన్ను గమనించడంలేదు. కంట్రోల్ చేసుకోవాలి. నీ ఏడుపును, నవ్వునూ, ఆగ్రహాన్ని సమస్త ఉద్వేగాల్ని కంట్రోల్ చేసుకోవాలి. ఏళ్ళ తరబడి నేర్చుకున్న విద్య. కంట్రోల్ చేసుకోవాలి. రాతిబండల్ని, నీడల్ని పరుచుకున్న మామిడితోపుల్నీ దాటుకుని, బస్సు పోతూ వుంది.

ఈ మామిడితోపుల మధ్యే కదా- నిస్సహాయంగా నిలబడి, నేను భోరు, భోరున ఏడ్చింది. చీకట్లు ముసురుకుంటున్న ఆ సాయంవేళ- నాల్కలు చాచుతున్న ఆ మంటల్ని నిర్ఘాంతపడి చూస్తూ, పెనుగులాడి, పెనుగులాడి, నా లోపల నేను పొడి పొడిగా రాలిపడుతూ- మళ్ళీ కళ్ళనిండా నీళ్ళు నిండుతున్నాయి.

వద్దు వద్దు దుఃఖాల్, కష్టాల్, నష్టాల్, బాధల్, గాథల్, పోతే పోనీ, పోనీ...

వేములవాడ గెస్టుహౌస్‌లో నాకో గది ఏర్పాటుచేసారు. మల్లా పురం సర్పంచ్, 'ఏం అక్క! ఎట్లున్నరు?' అంటూ పలకరించాడు. గుర్తు పట్టని పాతవాళ్ళు, కొత్తవాళు ళ్ళ. నా చుట్టూ ఓ చిన్న గుంపు. నిస్సహా యంగా నిలబడ్డా. ఈ పెళ్ళికి రాఘవరెడ్డి ఇందర్ని పోగేస్తున్నాడని తెలిస్తే వచ్చేదాన్ని కాదేమో!

"అక్కా... మీరు రెస్టు తీసుకోండి. నాస్త గదిలోకే పంపిస్తా," అంటూ నన్ను జాగ్రత్తగా చూసుకునే బాధ్యత ఎవరికో అప్పగించి, హడావిడిగా వెళ్ళాడు రాఘవ. ఎందుకొచ్చాను? ఎక్కడో అనామకంగా, మౌనంగా, నాలోకి నేను ముడుచుకుని, పడి వున్నదాన్ని- మూసిన తలుపుల్ని ఒక్కొటొక్కటిగా తెరుస్తూ ఎందుకొచ్చాను? స్నానంచేసి గది వరండాలో వేసున్న ఓ కుర్చీలో కూర్చుని చూస్తున్నా. తలమీద వెంట్రుకలు లేని గుండ్లు కాళ్లకి చెప్పులు లేకుండా, వంటరిగా, జంటలు జంటలుగా, జట్లతో- ఎదురుగా వున్న కోనేట్లో. పాచినీళ్ళతో స్నానాలు. ఏం దొరుకుతుందిక్కడ- దేవుడితో బేరసారాలా. ఏంకావాలి... ఎందుకీ పరుగులు...

'అక్కా! మీ కిష్టంగద," అంటూ ప్రసాదం లడ్ల పొట్లం నా చేతిలో పెట్టాడు శంకర్.

"నీకింకా గుర్తుందా?" నవ్వాను.

"ఎట్ల మర్సిపోతం! గా అర్ధరాత్రి తిననికి ఏం దొరకకుంటే దేవస్థానం వెంక టేషమ్ సార్, తాళాల్ని తీసిచ్చి మరీ, మనకు లడ్లు ఇచ్చిన సంగతి," అంటూ తనూ నవ్వాడు.

మధ్యాహ్నం భోజనాలయ్యాక ఏమీ తోచలేదు. అర్ధరాత్రెప్పుడో పెళ్ళి. ఎందుకో మానేరు వాగు... ఆ మామిడి తోపులు మళ్ళీ గుర్తుకొచ్చాయి. పద్దెనిమిదేళ్ళు గడిచాయి. గదిలోంచి బయటకు వచ్చి, బయట ఎవరితోనో మాట్లాడుతున్న శంకర్‌ని పిలిచి,

“నేను అట్లా బయట తిరిగి వస్తాను. ఓ కారేమైనా, ఎవరిదన్నా దొరుకు తుందా,” అన్నాను.

“ఎందుకక్కా, నా కారే వుంది గద,” అంటూ రెండు నిమిషాల్లో కారు తీసుకొచ్చి నా ముందు పెట్టాడతనే. హ్యాండ్‌బ్యాగ్ తీసుకుని డ్రైవర్ సీటువైపు వచ్చి, “దిగు” అన్నా. ఒక్క క్షణం తెల్లబోయి “ఎందుకు?” అంటూనే దిగాడు. నేను కూర్చుని, బ్యాగ్ ప్రక్కన పడేసి, బండి స్టార్ట్ చేస్తూ వుంటే,

“ఎక్కడికి, నేను కూడా వస్తాను కదా!” అన్నాడు.

నేను సీరియస్‌గా ముఖంపెట్టి, “ఎక్కడికని అడకూడదని తెలీదా! నువ్వు రాకూడదు కదా!” అన్నాను గద్దిస్తున్నట్టు.

ఏదో గుర్తొచ్చినట్టుంది. పెద్దగా నవ్వాడు. నేనూ నవ్వుతూ బండి స్టార్ట్ చేసి, “ఓ మూడుగంటలు. ఫోన్ చేయద్దను రాఘవని, నేనే వచ్చేస్తాను” అంటూ బయలు దేరా.

నా పెదవులపై నవ్వు ఇంకా చెరిగిపోలేదు.

శంకర్ ఏదో రహస్య సమావేశానికి రావాల్సిన వాళ్ళందర్నీ జాగ్రత్తగా చేరవేసి ఏర్పాట్లుచేసి, సమావేశం ప్రారంభం కాగానే, తను కూడా వచ్చి కూర్చున్నాడు. దీనిలో నువ్వుండకూడదంటే వినడు. ఇంత కష్టపడి ఏర్పాట్లుచేస్తే, చివరికి నన్ను కూర్చోనివ్వరా అంటూ సీరియస్‌గా వాదించాడు. అది గుర్తొచ్చింది ఇద్దరికీ.

ఎటువెళ్ళాలి? నాకో గమ్యమేమీ లేదు. వేములవాడ కమాను చౌరస్తా దాటాక మెల్లిగా ఎడమవైపు తిప్పాను బండి. కరీంనగర్ వైపు పల్లెల్లోకి వెళ్ళేందుకు.

శిథిలమైన మట్టిగోడలు. జాజు, నీలంరంగులు పూసిన దర్వాజాలు. చెదిరి పోయిన నినాదాలు, రెక్కలు చాచిన రాబందుల్లా. ఇండ్లపై యాంటినాలు, కోకో కోలాలు, బిస్లరీ వాటర్లు, మద్యం సీసాలు, జిల్లెళ్ళు మొలుస్తున్న గడీలు, పలకని రాతి దేవుళ్ళ గుడులు, చదువు చెప్పని బడులు- విరిగిన మగ్గాలు- ఆకు- తంబాకు చాటలు. యంత్రాల్లా కదిలే మునివేళ్ళు- మర్రిచెట్ల నీడన పత్తాలాట. మోటారు బండ్లపై పొల్లగాళ్ళు- తెల్లబట్టల ఛోటా నాయకులు, పైరవీకార్లు... కార్లు... సిమెంటు రోడ్లు... నాకు తెలిసిన పల్లెలు కావివి. మళ్ళీ బండి వెనక్కి తిప్పుకుని- సిరిసిల్లావైపు ప్రయాణం. నాకు తెలుసు నేను వెళ్ళాలనుకున్న చోటుకు పోలేకే ఇలా తిరగడమని. మళ్లీ ఎప్పుడొస్తానో తెలీదు... వెళ్ళాల్సిందే, అనుకుంటూ. ఆ మలుపు మీద పోలీసు స్టేషన్. చిన్న పార్కు... మెల్లిగా ఏదో గోడౌన్ అనుకుంటా. ఇప్పుడు సినిమాహాల్ కాదను కుంటా. కారు పార్క్ చేసి, ఆ వంపులో మెల్లిగా దిగి, కాస్త నీటుగా, చదునుగా వున్న దగ్గర కూర్చున్నాను. ఎండిపోయి- అక్కడక్కడా నీటి చెలమలు. దూరంగా బట్టలు వుతుకుతున్న చాకలివాళ్ళు నావంక చిత్రంగా చూసారు. కుడివైపు పలచబడ్డ మామిడి తోపు.

మానేరా, మానేరా- నన్ను వీడని మనియదా...

పన్నెండేళ్ళ తరువాత- ఈ ఊరికి... ఇన్నేళ్లుగా మనసు లోపలి పొరల్లో బంధించిన జ్ఞాపకాలు. నే తిరిగిన ఊళ్ళు- మనుషులు, వాళ్ళ ప్రేమలు, భయాలు, కోరికలు, నన్ను గుండెలకు హత్తుకున్న క్షణాలు- నాకు తెలీదు అది అనివార్యమో. నావల్ల కూడానో- నాకు నిజంగా తెలీదు. మరణించినవాళ్ళు... మృత్యువులోకి నేను చేజేతులా పంపినవాళ్ళు.

ఎవడికి తెలుసు. పద్దెనిమిదేళ్ళుగా ఏటి నీళ్ళని, మామిడితోపుల్నీ, కళ్ళనిండా కలలు నింపుకున్న లేప్రాయపు కుర్రవాళ్ళనీ, అందమైన పెద్ద కళ్ళున్న ఆడపిల్లల్ని చూసినప్పుడల్లా నన్ను నిలువనీయని ఆ జ్ఞాపకాలు గుర్తుకొచ్చి ఎంత డిస్టర్బ్ అవుతానో.

అప్పుడు నేను ఈ ప్రాంతంలోనే పనిచేస్తున్నాను. మాట్లాడేందుకు, కదిలేందుకు అనుమతిలేని కాలం. ఎక్కడ దాడి జరుగుతుందో. ఎప్పుడు, ఎవరిని పట్టుకెళ్ళి ఏ పేరుతో కాల్చి చంపుతారో తెలియని కాలం. అది ఎన్నికల సమయం కావడంతో ఆ సమయంలో దొరికే కాసింత వెసులుబాటును వినియోగించుకుని, ఏదో రూపంలో గ్రామాల్లో తిరిగి ప్రజలకు ధైర్యం చెప్పాలనుకున్నాం. ఎక్కడెక్కడివాళ్ళో- సుమారు నూట, నూటా ఇరవయిమంది ఇక్కడికి చేరుకున్నారు.

ఎవరూ ఆఫీసుకు ఇల్లు ఇవ్వని రోజుల్లో, ధైర్యంచేసి నర్సయ్య మాకో రెండు గదుల ఇల్లు అద్దెకిచ్చాడంటే కారణం వుంది. మా భయం చూపి, తన ఆస్తి పంచాయితీలు పరిష్కరించుకోవచ్చనే ఆశ. ఖాళీస్థలంలో టెంట్లు, వంటలు, కోలాహలంగా ఉందా చోటు. నేను, ఇతర మిత్రులూ వచ్చిన వాళ్ళందర్నీ చిన్నచిన్న బృందాలుగా చేసి ఏంచేయాలో, ఏ గ్రామాలు తిరగాలో వివరిస్తూ, ఒక్కొక్కర్నీ పంపిస్తున్నారు. అప్పుడొచ్చాడాబ్బాయి. బక్కపలచగా, తెల్లగా, పొడుగ్గా, కాళ్ళకి రబ్బరు చెప్పులు... భుజానికో బట్ట సంచీ, కొత్తగా, బెదురు, బెదురుగా చూస్తూ.

"ఎవరు కావాలి?" అడిగా.

"రవన్న రమ్మన్నడు" అన్నాడు. అంతలో రవి అక్కడికొచ్చి, ఆ పిల్లవాడ్ని పరిచయం చేసాడు.

"మాధవ. సిద్ధిపేటలో డిగ్రీ ఫస్టియర్. రెండేళ్ళుగా తెలుసు. ఇట్లా ఓసారి తిరిగితే, తనకీ అనుభవం వస్తుందని రమ్మన్నాను," అన్నాడు.

"మొదటిసారా?" అడిగాను.

"ఊఁ!" అంటూ తలూపాడు.

"సరే. మొదట భోజనం చేసి, ఎల్లారెడ్డిపేట వెడుతున్న ఆ బ్యాచ్‌తో వెళ్ళి, నాలుగురోజులు తిరిగిరా వచ్చాక మాట్లాడతాను," అన్నాను.

ఆ పిల్లవాడు వెడుతూ వుంటే అడిగాను "పాటలు పాడతావా?"

"ఓ! డప్పు కూడా కొడతాను," అంటూ వెళ్ళిపోయాడు. ఆ చెప్పటంలో చిన్న పిల్లల ఆనందమేదో కనపడి చిన్నగా నవ్వొచ్చింది.

మూడురోజులు గడిచి వుంటాయేమో? ఆనంద్ నాకు కంప్లయింట్ చేసేందు కొచ్చాడు. తన బ్యాచ్‌లో తిరుపతి మాధవ నిన్నటి నుండీ కనిపించటంలేదని. అందరికీ కంగారు. ఏంచేయాలి? ఏమై వుంటారు? పోలీసులు ఎత్తుకెళ్ళారని ప్రకటన ఇవ్వాలా? పత్రికలకి చెప్పాలా? మాలో మేం తర్జనభర్జనలు పడుతూవుంటే, సిద్ధిపేట నుంచో పిల్లవాడు చిట్టీ పట్టుకొచ్చాడు.

"మేం ఇద్దరం అర్జెంటుగా సిద్ధిపేట వెళ్ళాల్సి వచ్చింది. మరో రెండు రోజుల్లో తిరిగి వస్తాం. చెప్పనందుకు సారీ," అంటూ.

రెండు రోజుల తరువాత, ఎవరి పనుల మీద వాళ్ళు వెళ్ళిపోయాక, ఖాళీగా వున్న పాకలో, నులక మంచం మీద కూర్చుని పత్రిక్కి పంపాల్సిన రిపోర్టు రాసు కుంటున్నా. అప్పుడొచ్చారు వాళ్ళిద్దరూ. మెల్లిగా. వాళ్ళని చూడగానే విపరీతమైన కోపం వచ్చింది.

"ఏమనుకుంటున్నారు మీరు? ఏమన్నా జరిగితే..." అంటూ చెడామడా తిట్టి, హఠాత్తుగా గుర్తుకొచ్చి అడిగా

"తిన్నారా?" లేదంటూ తలూపారు. అయ్యో ఆకలితో వచ్చిన పిల్లల్ని తిట్టానే అని బాధనిపించి, తిని రమ్మని పంపాను. మెల్లిగా అడగాలి అసలెందుకు వెళ్ళారో!

మొదట తిరుపతిని పిలిచా. అతను నాలుగైదేళ్ళ నుండి బీడీ కార్మికుల్లో పనిచేస్తున్నాడు. ఏవో కేసులు కూడా వున్నాయి. ఆ అబ్బాయికి ఆ విషయాలు గుర్తుచేసి,

"ఏమిటిదంతా?" అడిగాను.

"మాధవ జర తోడొస్తవాన్న, అన్నడు. ఒక్కడే పరేషాన్ అవుతున్నడని నేను సుతబోయిన" అన్నాడు. మళ్ళీ తనే, "మాధవ ఒక పిల్లని ప్రేమించిండు. వీని క్లాస్ మెంటే. వీల్ల సంగతి ఆ పిల్ల ఇండ్ల ఎరికయి, గా పిల్ల తండ్రి పిల్లని మస్తు గొట్టిండు. ఆ పిల్ల దోస్తింటికి ఫోన్‌జేస్తే, ఎర్కయింది. వీని పానం ఆగలే. అట్టిట్ల జేసి, నిన్న గలిసినం గా పిల్ల జ్యోతిని. నేను నీతోనే వస్తా, తీస్క పొమ్మంటది."

తలెత్తి చూస్తే ఎదురుగా, కొద్ది దూరంలో చిన్నగా డప్పు కొడుతూ ఏదో నెమ్మదిగా పాడుకుంటున్నాడా పిల్లవాడు. వాడికి పద్దెనిమిది, పంతొమ్మిదేళ్ళన్న లేవు. అప్పుడే ప్రేమ! నుదిటిపై పడ్డ వెంట్రుకల్ని, తలపైకెగరేసి, సరిచేసుకుంటున్నాడు.

"నువ్వేం చెప్పావ్?"

"ఏముందక్కా! వాల్లింట్ల ఒప్పుకోరు. ఎట్లన్న గా పిల్లకి మేనబావ తయారు గున్నడు. వీనికా అయ్యా, అమ్మా ఎవరూ లేరు. ఏంజేస్తరు? ఏడికన్న పారిపోయి

చేసుకోవాలి. లేకుంటే, మీ అసుంటోల్లు, గా పిల్ల తల్లీదండ్రుల్ని పిలిపిచ్చి, గట్టిగ ధమ్‌కీ ఇచ్చిన్రనుకోరి, వాల్లె వూకుంటరు.'' అన్నాడు.

''ధమ్‌కీ,'' ఇదీ, నేను చేయాల్సిన పని. ఇది తిరుపతికి అర్థమైన పద్ధతి.

''సరే పో,'' అన్నా. తిరుపతి భార్య బీడీలు చుడుతుంది. ఈమధ్యే కాన్పయింది. మూడునెలల బాబు. ఇంటికెళ్ళి బాబును చూసి, మర్నాడు తెల్లవారు ఝామునే వస్తానన్నాడు. గేటుదాకా వెళ్ళినవాడు, వెనక్కి తిరిగి వచ్చి ''నా కొడుకుకొక మంచి పేరు చెప్పండ్రి'' అన్నాడు.

''సమర్, తరుణ్, మానస్, ఉల్లాస్... ఏదో ఒకటి. అసలు నేను చెప్పేదేమిటి తిరుపతి. బిడ్డని కన్న నీ భార్యకి ఏ పేరు పెట్టుకోవాలనిపిస్తే, ఆ పేరే పెట్టనీ,'' అంటూ చిన్నగా వాణ్ణి పొమ్మని చెయ్యి వూపా.

అప్పుడు పిలిచినా అబ్బాయిని. నేనేమంటానో అన్న భయంతో వచ్చి కూర్చు న్నాడు బిడియంగా. కొద్దిగా ఉంగరాల జుట్టు, మొఖంలో అమాయకత్వం, ఏవో కలలు కంటున్నట్లున్న కళ్ళూ- నేనేమీ అడగకముందే

''చెప్పకుండా పోయినందుకు సారీ అక్కా! తిరుపతన్న చెప్పండడుగద!'' అన్నాడు కొంచం భయంగా.

''చెప్పచ్చుగా!''

''చెబితే, మీరు పోనివ్వరని'' అదీ నిజమే. ఉద్యమాల అవసరాలు, ప్రాధాన్యతాక్రమాలు వేరు.

పంతొమ్మిదేళ్ళ వయసులో ప్రేమించిన వాడిని ఓ గంటసేపు చూసేందుకు తొమ్మిది గంటలు ప్రయాణించి పోయినదాన్ని. నాకు నవ్వొచ్చింది.

వాడిచేతిమీద చెయ్యేసి ''భయపడకు, నేనేం అనన్లే. అయితే, పారిపోయి పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నారా?'' అడిగా.

ఆ పిల్లవాడి కళ్ళలో కన్నీటి పొర నన్ను దాటిపోలేదు. వాడి భుజంపై చేయివేసి దగ్గరకు లాక్కుని,

''నిజంగా, నేను మాట్లాడతాను కదా! వాళ్ళ ఊర్లో కూడా, మనవాళ్ళున్నారు. మెల్లిగా చెబుదాం. ఏంకాదులే. మొదట చదువుకొని, మీరు మీ కాళ్ళ మీద నిల బడాలి'' అన్నాను.

నా మాటల్లో వాడికేదో భరోసా కనిపించినట్లుంది. మొఖంలో కొంచెం వెలుగొచ్చింది.

''నీ పాట నేను వినలేదు. బాగా పాడతావట గదా!'' అన్నా.

''రాస్తాను కూడా,'' అన్నాడు. ఇప్పుడా మొఖం పూర్తిగా వెలిగిపోతోంది. ఒక్క ఉదుటున లోపలికి పరుగెత్తి, ఒక నోటుబుక్కు పట్టుకొచ్చాడు. ఏదో క్యాలెండర్ పేజీ అనుకుంటా తిప్పి అట్టేశాడు. పైన ఎర్రటి అక్షరాలతో మాధవ అని రాసుంది. ఒక మురళి, రెండు నెమెలి పింఛాలు.. బొమ్మ-

"ఎప్పట్నించి"

"రెండేళ్ళ నుంచి- ఎట్ల రాయాల్నో తెల్వదుమల్ల" అన్నడు చిన్నగా నవ్వుతూ, కొద్దిగా సిగ్గుపడుతూ- పుస్తకం నా చేతికిచ్చాడు.

"పుట్టగానే పరుగెత్తరెవ్వరూ మెల్లిగానే నేర్చుకుంటారు" అంటూ తెరిచా.

కొత్తగా రాసే పిల్ల కవుల రాతల్లాగానే వున్నాయి. అవినీతి మీదా, గాంధీజీ, మదర్‌థెరిసా, పేదల కష్టాలు, ఎర్రజెండా, కాలేజీ మిత్రుల గురించి ఇలా... 'అనాథ' అన్న కవిత బహుశా తన గురించేనేమో కొంత టచ్చింగా వుంది. ఆ తరువాత కొన్ని ప్రేమ కవితలు. నిన్ను చూడకుండా నేనుండలేను. నిద్ర పట్టడంలేదు. రాత్రి కల్లోకొచ్చావు. ఎక్కడ చూసినా నువ్వే కనిపిస్తున్నావ్" టైపు.

వీటి క్రింద అంకితం జ్యోతి. బై మాధవ అని రాసుకున్నాడు.

"ఊు! అంతిష్టమా జ్యోతి" అడిగా.

"ఊు!" అంటూ తలూపి, గబగబా పొడుగు చేతుల చొక్కా పైకి మడిచి చూపించాడు. చేతిపైన పచ్చబొట్టు. వెలుగుతున్న దీపం బొమ్మ. ఏంటవని కళ్ళెగరేసా!

"వెలుగుతున్న జ్యోతి," అన్నాడు.

"మరి ఆ అమ్మాయి కూడా పొడిపిచ్చుకుందా?"

"ఊహు! వాళ్ళింట్లో చూస్తారుగద. నన్నయితే అడిగెటోడు ఎవ్వడు లేడు," ధీమాగా అన్నాడు.

ఏదో అందామనుకొని ఆ మాటల వెనుకున్న విషాదం కూడా అర్థమయి, చప్పున ఆగిపోయా.

"జ్యోతికి మేనరికం వుంది. చదువుకుంటానని ఏడ్చి గోల చేస్తే, కాలేజీకి పంపుతున్నారు. ఇప్పుడీ సంగతి తెలిసింది గదా! బలవంతంగానన్న పెండ్లి జేస్తరు," అన్నాడు. కాస్తాగి తనే మళ్ళీ, "అయినా జ్యోతేం ఊకోదులే. పెండ్లిజేసినా ఆ మొగుడ్ని ఒక్క తన్ను తన్ని, నా దగ్గిరికే అస్తది మల్ల" అని నవ్వాడు.

"అంత నమ్మకమా?" అడిగాను.

"అవును," అన్నాడు దృఢంగా. పరిస్థితులు, ప్రభావాలు అంటూ మాట్లాడి, వాడి విశ్వాసాన్ని చెదరగొట్టాలనిపించలేదా క్షణాన.

అంతలోనే ఏం గుర్తొచ్చిందో, మళ్ళీ లోనికి పరుగెత్తుకెళ్ళి, తన సంచీ పట్టుకొచ్చాడు. దాంట్లోంచి ఒక చొక్కా, ఇంకుపెన్నూ జాగ్రత్తగా పేపర్‌లో చుట్టి వుంది తీశాడు.

"లాస్ట్‌మంత్ నా బర్త్‌డేకి జ్యోతి గిఫ్ట్ ఇచ్చింది. ఈ పెన్నుతో నేను చాలా కవితలు రాయాల్నంట," మొఖంలో సంతోషం.

మనసులో గట్టిగా అనుకున్నా, ఈ పనులన్నీ అయిపోయాక ఒకసారి ఆ పిల్ల తల్లిదండ్రులతో నేనే తప్పకుండా మాట్లాడాలని. ఆ మాటే చెప్పా. సంతోషం పట్టలేక,

నా చేయి పట్టుకుని, "థ్యాంక్స్ అక్కా!" అంటూ గట్టిగా ఊపి బయటకు పరుగెత్తాడు, ఆనందం పట్టలేకనో, తన వంటరితనపు కన్నీళ్ళని నాకు చూపలేకనో.

ఆఖరి లైన్లు రాస్తున్నాను. "అన్నం తింటారా?" చీకటిపడింది చుట్టూ. తలెత్తి చూస్తే మాధవ. తలూపాను. రెండు కంచాల్లో అన్నం కూరా ప్రొద్దుటి పప్పుచారు. బయట వెన్నెల్లో రెండు నులకమంచాలేసి పిలిచాడు.

"ఎందుకు నేనే భోజనాల దగ్గరికి వచ్చేదాన్ని కదా," అంటూ లేచి వచ్చాను. తింటున్నంతసేపూ, ఆ పిల్లవాడు ఉత్సాహంగా చెబుతూనే వున్నాడు. ఈరోజు మాధవుడి రోజు-

తండ్రి చిన్నప్పుడే పోయాడు. పదో ఏట తల్లి చనిపోతే, చిన్నాన్నలు చదువు మాన్పించి జీతానికి పెట్టారు. పారిపోయి సిద్ధిపేటకు వచ్చి, తాను చదివిన స్కూల్ గేటు వద్దే రాత్రంతా చలిలో పడుకున్నాడు. ఉదయం... విద్యాసాగర్ అని, ఏదో టీచర్ల సంఘంలో పనిచేస్తాడట. చూసి తనింట్లోనే కొన్నాళ్ళు పెట్టుకుని, చివరికి సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో పెట్టాడట. చిన్నాన్నలు వచ్చి గొడవచేస్తే, గట్టిగా బెదిరించి పంపేసాడట. దీని తరువాత ఎప్పుడూ తను ఊరికి వెళ్లలేదట.

పదో తరగతి వరకూ ఆ సారే. తన బాగోగులు చేసేవాడట. మూడేళ్ళ క్రితం ట్రాన్స్‌ఫర్ అయి వేరే వూరు వెళ్ళిపోయాడట.

"మరి సెలవులొస్తే?"

"అక్కడే హాస్టల్‌నే వుంటా," నన్నాడు. ఉదయం న్యూస్‌పేపర్లేస్తాడు. సాయంత్రం ఏదో దుకాణంలో పద్దులు రాసి పెడతాడు. ఖాళీ సమయాల్లో ఏవో చిన్నచిన్న పన్లు-

తలక్రింద రెండు పాత దుప్పట్లు దిండులా పెట్టుకుని వెల్లికిలా పడుకుని- ఆకాశంలో మెల్లిగా కదులుతూ, ఆగిఆగి మబ్బులతో ఆడుకుంటున్న నిండు చందమామ, చూస్తున్న నక్షత్రాలు ఎంత నిశ్చింతగా వుందో మనసుకి.

పక్కనే, మరో నులక మంచంపై మాధవ-

"జ్యోతి పరిచయం కాకముందు ఒక్కోసారి చచ్చిపోవాలనిపించేది. నాకు ఎవరూ లేరని, ఎన్నిసార్లు రహస్యంగా ఏడ్చుకున్నానో. ఎందుకో తెల్వదు నా మనసు లున్నదంతా. తనకి చెప్పేస్తే, నాకు హాయిగా వుంటది. ఒకొక్కసారి నేను బాధపడితే, తను బాధపడేది కానీ, తనే, నేను నీకున్నగద అని ధైర్యం చెప్పేది."

నేను ఊకొట్టకపోవడంతో వినడంలేదనుకున్నాడనుకుంటా. "ఇంటున్నరా?" అన్నాడు.

"ఆ...ఆ... చెప్పు," అన్నాను.

"నాలాంటి కష్టాలు ఏ పిల్లలకి వుండకూడదక్కా," అన్నాడు.

“నీ చదువయిపోయాక ఏం చేయాలనుకుంటన్నావు,” అడిగాను.

“నాకు చిన్నపిల్లలంటే ఇష్టం. అన్నింటికన్నా, టీచర్ పని గొప్పదని అనిపిస్తది నాకు. మేమిద్దరం గల్సి పిల్లల కోసం ఒక మంచి స్కూల్ బెడ్తం. క్లాసులు చెట్లకింద- అదేంది, ఆఁ... శాంతినికేతన్ లెక్క,” అన్నాడు.

“మంచిగ సెటిల్ కావాలక్క. మనం మనకి తోచినంత ఇతరులకి సాయ పడాలె.”

“ఇంకా...” రెట్టించాను.

“నాకు మొక్కలంటే ఇష్టం. ఎప్పటికన్నా పొలంగొంటె ఏటివొడ్డున, ఒక రెండె కరాలన్న- అందులో చిన్న గుడిసేసుకుని, చుట్టూ పూలమొక్కలు పెట్టుకుని వుండాలె,” కొంచెం సిగ్గుపడుతూ అన్నాడు.

“ముసల్దాన్నయ్యాక, నేను కూడా మీ ఇంటికే వచ్చేస్తా- అట్ల వుండటం నాక్కూడా ఇష్టమే,” అన్నా నవ్వుతూ.

“ఇంతగనం ఎవ్వరితో మాట్లాడలే. మీతో ఎందుకో మాట్లాడాలనిపించింది,” అన్నాడు నెమ్మదిగా.

ఆ చల్లటి వెన్నెల రాత్రి ఆ పిల్లవాడి మొఖంలో ఏదో అవ్యక్తపు ఆనందం. నక్షత్ర కాంతి. ప్రేమ, అది ఎంత అద్భుత అనుభవం!

రాత్రి పన్నెండున్నర దాటింది. “మీరు రేపు రామ్మడుగు వైపు వెళ్ళాలి, ఇక పడుకో,” అంటూ దుప్పటి గుండెల దాకా లాక్కుని ముడుచుకు పడుకున్నా. నిద్ర పట్టేసింది. ఏ రాత్రో పక్కకు వొత్తిగిల్లి కళ్లు తెరిస్తే, ఆ పిల్లవాడు కళ్ళార్పకుండా చందమామను చూస్తూ వున్నాడు. మళ్ళా నేను నిద్రలోకి జారుకున్నా.

ఇంకా తెల్లారలేదు. తిరుపతి వచ్చి లేపాడు, వెడుతున్నామని చెప్పేందుకు. “వేములవాడలో వున్న ఆ ఆరుగుర్ని కూడా తీసుకువెళ్లండి,” అన్నాను. ఇంకా నిద్రమత్తుగానే వుంది. కాస్త దూరంగా నిలబడ్డ మాధవ “వస్తామక్కా!” అన్నాడు. అద్దాలులేని నా కళ్ళకి, ఆ పిల్లవాడి రూపం మసగ్గా కనిపించింది. చేయి వూపి, బద్ధకంగా మళ్ళీ పడుకున్నా.

ఆ సాయంత్రం... తెలిసిన విలేఖరి హడావిడిగా ఆఫీసుకి వచ్చాడు. “ఇవ్వాళ పొద్దున్నో, మధ్యాహ్నమో ఇంకా ఖచ్చితంగా తెలీదుగానీ, మీవాళ్ళనే ఇద్దర్ని ఎన్‌కౌంటర్ చేసారు,” అన్నాడు.

ఆతృతగా అడిగా, “ఎవరో తెలిసిందా? ఎక్కడ?” అంటూ.

“రామ్మడుగు దగ్గర. తిమ్మన్నపల్లి గుట్టల్లోనట,” అన్నాడు. పరుగెత్తాం ఓ పదిమందిమి. భయంభయంగా గ్రామస్తులు దారిలో. వెతుక్కుని, చివరికి ఆ సంఘటన జరిగిన చోటుకి.

'ఎవరు? ఎవరు చనిపోయారు? నేను పంపించిన పిల్లల్లో- మొత్తం వెళ్ళిన ఎనిమిదిమందిలో- ఎవరు వాళ్ళు- అప్పటికే చీకట్లు ముసురుకున్నాయి. ఎక్కడ చూసినా పోలీసులు- దగ్గరికి పోనీలేదు మమ్మల్ని. బలవంతంగా వెళ్లగొట్టారు. ఆ రాత్రి ఎవరికీ తెలీకుండా శవాల్ని సిరిసిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఎందరు అధికారుల తలుపుల్ని తట్టినా తెరుచుకోలేదు. కనీసం చనిపోయింది ఎవరో మమ్మల్ని చూడనివ్వండన్న. కుటుంబసభ్యుల్ని తప్పా ఎవర్ని చూడనివ్వమని తెగేసి చెప్పారు.

ఎవరి బంధువుల్ని పిలవాలి. ఆ వెళ్లిన బృందంలోని పిల్లలు రాష్ట్రం నలు మూలల నుండీ వచ్చినవాళ్ళు. వాళ్ళ పేర్లు వెతుక్కుని, చిరునామాలు వెతుక్కుని... కొందరా పనిలో. పోనీ బతికిన పిల్లలు- ఎవరైనా సరే తిరిగి వచ్చేయవచ్చు కదా! ఏం జరిగింది. మిగిలినవాళ్ళని సజీవంగానే పట్టుకుని- మళ్ళీ చంపేసి- వద్దు, వద్దు- ఆఫీసులో పాతికమంది పిల్లలు- కొందరు పెద్దలు. జరిగిన ఎదురుకాల్పులని ఖండిస్తూ తెల్లకాగితాలపై నినాదాలు రాస్తున్నారు. మధ్యాహ్నం నాలుగు గంటలకి- పోస్టుమార్టం చేసి, ఈతాకు చాపల్లో వాళ్ళని చుట్టి ఆసుపత్రి ప్రక్కనే వున్న ఓ పాడు బడిన మార్చురీలో పెట్టారని తెలిసి, పరుగెత్తాం- మనవాళ్ళని మనం తెచ్చుకుందాం అంటూ- ఆవేశంగా. కదిలారు పిల్లలు. తొలి యవ్వనప్రాయంలో ఉత్సాహం వెల్లి విరిసే పిల్లలు. కలలుకనే అద్భుత మంత్రదండాన్ని అప్పుడే అందుకున్న పిల్లలు. ఏదో జరగనున్నదని గ్రహించినట్లున్నారు పోలీసులు. చుట్టుముట్టి ఎవర్నీ కదలనీయ కుండా- చక్రబంధం బిగించారు. మా పెనుగులాట, వాదనలు.

ఇంతలో ఎవరో వార్త మోసుకువచ్చారు. ఆసుపత్రిలో పనిచేసే వార్డ్‌బాయ్- ఒక శవాన్ని గుర్తుపట్టి, రహస్యంగా మాకు కబురు పంపాడు. ఆ ఒక శవం- తిరుపతిది. పరుగెత్తు, పరుగెత్తు, తిరుపతి ఇంటికి. చీకటి పడేలోగా... శవాల్ని దహనం చేసేలోగా రావాలి. కడసారి చూపుకు. ఎక్కడున్నా క్షణాల్లో చేరుకోవాలి.

తిరుపతి- తిరుపతి అమ్మకు చెప్పు, భార్యకి చెప్పు చచ్చిపోయాడు, ఇకరాడు- రానేరాడు మీ తిరుపతని- ఎవరు చెప్తారు, నువ్వా, నువ్వే మృత్యువార్త మోసుకు వెడతావా? వెళ్ళండి... వెళ్ళండి.

ఎవ్వరూ లేరాతని ఇంట్లో. దూమాలలో బంధువులింట్లో పెళ్ళికి వెళ్ళారు. తెలీదు. ఆ ఉదయం, తిరుపతికి తన చావు పొంచి వుందని తెలీదు. ఏం జరగనుందో తెలీదు. ఇంటి నుండి కళ్ళు సరిగ్గా కనిపించని ముసలి తాతను పట్టుకొచ్చారు. ఆ వృద్ధుడు భయంతో, దుఃఖంతో గజగజ వణుకుతున్నాడు. చనిపోయినవాడికి నువ్వు తాతవేనని నమ్మకమేమిటి అంటూ, దగ్గరికి, పోనీలేదు పోలీసులు. తల్లిదండ్రులకి ఒక్కడే కొడుకు- రుజువు... రుజువు కావాలి- నీవాడేనని- మాధవ ఏమవుతాడు...

తిరుపతికి. పట్టుమని పదిరోజుల పరిచయమన్నాలేదు. ఒక పెద్దన్నలా, వాడికి ధైర్యం చెప్పి, వాడి ప్రేమ వ్యవహారం పరిష్కరించేందుకు పరుగెత్తుకెళ్ళాడు. నిన్నటి రాత్రి- తన పిల్లవాడితో ఆడుకున్నాడా? భార్య ఇంకా చిన్నపిల్లే. ఏమౌతుందా పిల్ల? ఆ పసివాడిని ఎట్లా పెంచుతుంది?

ఎంతో కొట్లాడాక, మాలో కొందర్ని దహనక్రియలు దూరం నుండి చూసేం దుకు అనుమతించారు. చీకటి కమ్ముకుంటోంది. మానేటి ఏటి వొడ్డున అక్కడక్కడా కాసిన్ని నీటిమడుగులు. ఆ వొడ్డునే మామిడితోపుల వద్ద, ఎత్తుగా పేర్చిన రెండు చితులు. ఆ కట్టెల క్రింద ఎవరున్నారు? ఆ రెండో వ్యక్తి ఎవరు? మాధవా?

ఊహుఁ మాధవ కాకూడదు. వాడు బతికే వుండాలి. నా కళ్ళలో గిర్రున నీళ్ళు తిరిగాయి. నిన్నటి నుండీ లోలోన ఇసుక తుఫానులు- కట్టలు తెగిన దుఃఖ సముద్రం. లోలోపల నేను మెల్లిగా శిథిలమవుతున్నాను. మాధవ కాకపోతే, ఇంకొక పిల్లవాడు. మాధవలాంటి మరో పిల్లవాడు. మాధవ బతికే వుండాలనుకుంటే, ఇంకొకడు, ఇంకొకడు- ఎవరు- ఎవ్వరా చితిక్రింద.

కట్టెలు పేర్చిన ఆ చితి మధ్య- విగతజీవిగా, ఎవరో పిల్లవాడు. వాడికీ ఒక కల వుందా! ఒక ప్రేమకథ వుందా? ఒక వెన్నెల రాత్రి వాడూ వాడి జీవకాంక్షని- ఎవరికైనా చెప్పాడా? ఎవరా పిల్లవాడు. మాధవా నువ్వు బతకాలిరా? వాడి అంతరాంత రాల్లో జరిగిన ఘర్షణ, వాడి నవ్వు, దుఃఖం, ప్రేమ, రేపటి కలలు నాకు తెలుసు. నాతో పంచుకున్నాడు. కలలు కంటున్నట్లున్న వాడి కళ్ళు- ఇప్పుడిప్పుడే మొగ్గ తొడుగుతున్నవాడి కవిత్వం- ఏటివొడ్డున- పొగడపూల చెట్ల క్రింద- వాడి చిన్న గుడిసె- ఆ పిల్లవాడు ప్రేమించిన పిల్ల- వాడికోసం అన్నీ వదిలేసుకు వచ్చేయగల ఆ పిల్ల ఆ అమ్మాయికి ఎంత దుఃఖం. వద్దు, వద్దు నువ్వు చనిపోకూడదు మాధవ- చనిపో కూడదు. అయితే, అయితే మరో పిల్లవాడు- వాడి కలలేమిటో నాకు తెలియని మరో పిల్లవాడు- ఫర్వాలేదు, నాకు తెలీదు కదా ఫర్వాలేదా- వద్దు వద్దు ఎవరూ వద్దు- దిక్కులేనట్లు- అనాథలుగా- అక్కడ- చితుల మధ్య పడి వున్నారు వాళ్ళు. కడసారి వీడ్కోలైనా చెప్పలేని నిస్సహాయత... ఎవరో ఆ చితులకు నిప్పుపెట్టారు. నల్లటి పొగలు. ఎర్ర ఎర్రటి మంటలు- ఆ మంటల్లో నేను- నేనేనా- నేనే పంపాను ఆ పిల్లల్ని- నేనే పంపాను ఆ పిల్లల్ని. నా మాట విని పరుగెత్తుకెళ్ళారు. నేనే పంపాను. ఎవరు- ఆ రెండో వ్యక్తి ఎవరు? నాకు తెలీకుండానే- ఆ రాళ్ళవైపు- దూరంగా కాలు తున్న ఆ చితుల దగ్గరకి పరుగెత్తుకెళ్ళాను. నేను ఏడుస్తున్నాను. భోరున ఏడుస్తు న్నాను. పోలీసులు లాఠీలు అడ్డుపెట్టి ఆపేసారు.

ఎవరు బ్రతికారు- ఎవరు మరణించారు? ఆ క్షణం- నేను కూడా మరణిం చానా వాళ్ళతోపాటు? ఆ తెల్లవారుఝామున- ఇంకా వెలుగురాని ఆ నిముషాన.

మసక మసక రూపాల్తో కనబడ్డ ఆ ఇద్దరు పిల్లలు- నాకు చేయి వూపి ఆఖరి వీడ్కోలు చెప్పి- నిప్పుల కొలిమిలోకి నడిచి వెళ్ళిపోయిన ఆ ఇద్దరు పిల్లలు- అయ్యో- మాధవా, మాధవా, నువ్వు బతికున్నావా? చనిపోయావా?

అప్పుడొచ్చింది తిరుపతి భార్య మూడు నెలల కొడుకునెత్తుకొని. అతని తల్లి గుండెలు బాదుకుంటూ ఏడుస్తోంది. ఎవరో బంధువులు... ఆ కాలుతున్న చితుల వద్దకి. వాళ్ళని కూడా వెళ్ళనివ్వలేదు. తిరుపతి భార్యకి ఏడ్చి, ఏడ్చి గొంతు పూడిపోయింది. "నా బిడ్డకి నువ్వు చెప్పిన పేరే పెడతానన్నాడక్కా..." ఏమని ఓదార్చగలనా పిల్లని.

మర్నాడు ఉదయం- పత్రికల్లో ఎప్పుడు వచ్చే రొటీన్ కథనాలు- తిరుపతి గురించిన వివరాలు- ఖండనలు, సమర్థనలు, మరో గుర్తు తెలీని వ్యక్తి ఎక్కడివాడో, పేరేమిటో- వివరాలు తెలీవు. అయితే ఆ వ్యక్తి ఎడమ చేతిపై దీపం బొమ్మ- పచ్చబొట్టు వుందని రాశారు. అయిపోయింది. నేను భయపడింది నిజమైంది.

రెండు రోజులకల్లా రామ్మడుగు వెళ్ళిన బృందంలోని మిగిలిన పిల్లలు- ఒక్కొక్కరూ చేరుకున్నారు. అసలేం జరిగింది? ముక్కలు ముక్కలుగా, వేరువేరు వ్యక్తులు ఇచ్చిన సమాచారం అంతా ఒకే దగ్గరికి చేరిస్తే, జరిగింది ఇది.

ఆ ఎనిమదిమందీ, వెళ్ళాల్సిన సెంటర్‌కు చేరుకునేసరికి ఉదయం ఏడున్నర. అక్కడి నుండి లోనికి పన్నెండు కి.మీ. దూరంలోని పల్లెకి వెళ్ళాలి. బస్సు అప్పుడే వెళ్ళిపోయింది. మళ్ళీ మధ్యాహ్నం దాకా లేదు. అడ్డదారిని పోతే రెండు మూడు గంటల్లో నడిచిపోవచ్చని అంతా బయలుదేరారు. కొంతదూరం పోయాక, పొలాలు, గుట్టలు గల దగ్గరి తొవ్వ బట్టారు. చిన్న పల్లెదార్లో- ఓ కుండీ వద్ద- నలుగురు కాలకృత్యాల కోసం ఆగి, మిగిలిన వాళ్ళని పొమ్మన్నారు. మాధవ... తిరుపతి... మరో ఇద్దరు- దాదాపు ఊరి సమీపంలోని గుట్ట వద్దకి వచ్చారు. అప్పటికే కూంబింగ్ ముగించుకుని, ఆ దారినే పోతున్న స్పెషల్ పోలీసుల కళ్ళబడ్డారు వీరు.

'ఎవరు, ఆగం'డని పోలీసులు అరుస్తూ వుంటే, కొద్దిగా వెనక నడుస్తున్న ఇద్దరు పిల్లలు- వెనక్కి పరుగెత్తారు. ముందున్న తిరుపతి, మాధవకి కంగారులో ఏంచేయాలో తోచలేదు. వాళ్ళు ఎడమవైపు ఊరి దిక్కుగా పరిగెత్తారు. బహుశా ఊర్లోకెడితే రక్షణ దొరుకుతుందనుకున్నారేమో? పోలీసులు వీళ్ళిద్దరి వెంటబడి, కాల్చారు. తిరుపతి అక్కడికక్కడే పడి చనిపోయాడు. మాధవకి దెబ్బ తగిలింది. అయినా పరుగెత్తి కల్వర్టు క్రింద నీళ్లు పోవడానికి పెట్టే తూములో దాక్కున్నాడు. పోలీసులు వెతికినా దొరకలేదు. ఈలోగా వచ్చిన రెండవ పోలీసు బృందంలో కుక్కలున్నాయి. అవి పసిగట్టి, అక్కడికెళ్ళి అరిస్తే రక్తపు మరకల ఆనవాళ్ళను బట్టి, తూములో దాక్కున్నాడని గ్రహించి, 'చంపం బయటకు రమ్మని,' పోలీసులు అంటే-

బయటకు వచ్చి, వంటినిండా గాయాలతో నిలబడ్డ మాధవని... నిరాయుధుడ్ని- వెంటనే కాల్చి చంపేశారు. చావుకీ, బతుక్కీ మధ్య వేలాడుతూ ఆ తూములో దాక్కున్నప్పుడు- ఆ పిల్లవాడు మాధవ- ఏం ఆలోచించి వుంటాడు?

వచ్చిన పని పూర్తయి, ఒక్కో బృందం తిరిగి ఎవరి ప్రాంతాలకు వాళ్ళు వెళ్ళిపోతున్నారు. ఆ ఏర్పాట్లు, హడావిడిలో వుండగా, మధ్యాహ్నం- రెండు గంటలకి ఒక అమ్మాయి వచ్చింది, నన్ను కలిసేందుకు. అర్జెంటేమీ లేకపోతే ఓ గంట ఆగమని- నా పనిలో పడిపోయాను. చివరి బ్యాచ్‌ను పంపుతూ వుంటే ఆ పిల్ల మెల్లిగా నా దగ్గరికి వచ్చి,

"ఆలస్యం అవుతోంది. నేను వెళ్ళాలండీ," అంది. అప్పటికే నాలుగు దాటింది ఆ పిల్లకి సారీ చెప్పి, అక్కడే మంచంపై కూర్చోమన్నా. ఆ పిల్ల తల అడ్డంగా ఊపి, "మీతో విడిగా మాట్లాడాలె," అంది. సరే నా వెనకే రమ్మని టెర్రస్‌పైకి తీసుకెళ్ళి వేపచెట్టు నీడపడే ఓ మూల క్రింద కూర్చున్నాం.

లంగా ఓణీ. బిగించి నున్నగా దువ్విన పెద్ద జడ. ఆ కళ్ళు- వత్తయిన కనురెప్పలున్న పెద్ద కళ్ళు- నా ఎదురుగా తలవంచుకు కూర్చున్న ఆ అమ్మాయి కాస్సేపు ఏం మాట్లాడలేదు. మెల్లిగా తలెత్తి నీళ్ళు నిండిన కళ్ళతో, "నేనేనండీ జ్యోతిని," అంటూ నా చేయి గట్టిగా పట్టుకుంది. నేను ఏదో మాట్లాడబోయేసరికి, ఒక్కసారిగా భోరున ఏడ్చింది. ఆ అమ్మాయిని దగ్గరికి లాక్కుని- పొదివి పట్టుకుని ఏమని ఓదార్చను- నా కళ్ళ నుండి కన్నీళ్ళు అప్రయత్నంగా జారిపోతూ వుంటే...

"మీరు మాట్లాడతానన్నారని చెప్పిండు," అంది. నేను ఆ పిల్ల కన్నీళ్ళు తుడిచి ఊరుకోమని చెబుతున్నా.

"నేను ఇంట్లో చెప్పిరాలేదండీ- కనీసం మిమ్మల్నయినా చూద్దామనిపించి..." దుఃఖంతో ఆ పిల్ల గొంతు పూడుకుపోయింది. హఠాత్తుగా ఏదో గుర్తుకొచ్చి క్రిందికి పరుగెత్తా. మళ్ళీ, ఆ పిల్ల దగ్గరికెళ్ళి-

"ఏదో రిపోర్ట్ రాస్తూ, పెన్ను కావాలని అడిగితే, ఇది ఇచ్చాడు. ఇది తనదే," అంటూ, ఆ అమ్మాయికిచ్చా.

నీళ్ళు నిండిన కళ్ళతో అంది, "ఇది నేను తనకిచ్చినదే," అని.

"నేను ఇంటికి సిద్ధిపేటకెళ్లాలె. ఆలస్యం అవుతోంది. ఇక వెల్తా," అంటూ మెల్లిగా లేచి వెళ్ళిపోయింది.

పుస్తకాలు గుండెలకు పట్టుకొని- జన సంచారం అంతగా లేని ఆ వీధిగుండా, ఒంటరిగా వెడుతున్న ఆ పిల్లని... ఎవర్నీ ఒక్క మాటన్నా అనకుండా గుండె నిండా దుఃఖంతో వెడుతున్న ఆ పద్దెనిమిదేళ్ళ పిల్లను- అలాగే చూస్తూ వుండిపోయా- ఏమై వుంటుందా పిల్లకి?

ఆ పిల్లవాడు, వాడి అమాయకపు ప్రేమ, కలలు మానేరు ఏటివొడ్డు- మామిడి తోటల్లో మునిమాపు వేళ కాలుతున్న రెండు చితులు, కమురు వాసన పైకి లేస్తున్న నల్లటి పొగమేఘాలు- నాల్కలు చాచిన ఎర్రటి మంటలు- ఆ పిల్ల తడి కళ్ళు- ఏళ్ళ తరబడి గుర్తుకొచ్చినప్పుడల్లా- హృదయాన్ని మెలిపెట్టినట్టు ఎందుకీ తలపోతల వగపు- తెలిసో తెలీకో, అనివార్యమో, అవసరమో. ఎందరెందరిట్లా చనిపోయారో...

మూట మోసుకెడుతూ వున్న ఒక చాకలి ఆమె- 'చీకటైంది బిడ్డ,' అంటూ పలకరిస్తే మళ్ళీ ఈ ప్రపంచంలోకి- అప్పటికి ఐదు మిస్డ్ కాల్స్- సైలెంట్‌లో పెట్టాను కాబట్టి గమనించలేదు. శంకర్, రాఘవ ఇంకెవరో... హడావిడిగా బయలుదేరా వెనక్కి. దూరమేం కాదు కదా! ఫోన్ చేసి... వచ్చేస్తున్నానని చెప్పి, చేరుకునేసరికి- గది ముందు శంకర్.

"ఏమైన్రు ఎవరన్నా? కిడ్నాప్ చేసిన్రేమోనని," అంటూ నవ్వుతూ ఏదో అన బోయాడు.

"ఆరోజులు పోయాయిలే శంకర్," అంటూ లోనికెళ్ళా. స్నానంచేసి బట్టలు మార్చుకుని పెళ్ళి జరిగే హాల్‌కెళ్ళా. చీకటి పడిపోయింది. పలకరించేవారు, కొత్తగా పరిచయం చేసుకునేవాళ్ళు- రాత్రెప్పుడో పెళ్ళి కాబట్టి ముందుగానే, కూర్చున్న వద్దకే పానీయాలు- స్టాటర్స్- బఫే భోజనాలు- పెరిగిన ధనిక, ఎగువ మధ్యతరగతి మనుష్యులు- నీటి వసతి. కొత్త వ్యాపారాలు పెరిగి- ఒకప్పటి కరీంనగర్ కాదిది- జరిగిన మార్పులను అంచనా వేసే వాళ్ళెవరు- ఏంచేయాలో ఎలా చేయాలో... మళ్ళీ కొత్తగా ప్రారంభించేదెవరు?

తిన్న భోజనం ప్లేటు పెట్టేసి, చేయి కడుక్కుని ఓ కప్పులో ఐస్‌క్రీం పట్టుకుని, ఆ కోలాహలానికి కొద్దిగా దూరంగా కుర్చీలో కూర్చుని తింటున్నా. నీలాకాశం నక్షత్రాల క్రింద నా నిశ్శబ్దంలో నేను...

"కూర్చోవచ్చా?" ఎదురుగా వున్న కుర్చీలో కూర్చుంటూ అడిగిందొకావిడ.

"పొద్దటి సంది- బస్సులో మిమ్మల్ని చూడంగనే గుర్తుపట్టిన. మా ఆయన, పిల్లలున్నరని మాట్లాడలేకపోయిన. గెస్టుహౌస్ దగ్గరికి కూడా వచ్చిన.. ఒస్తరేమో మీతో మాట్లాడాలని..."

నాకేం అర్థంకాలేదు. తినటం పూర్తయి, కప్పు క్రింద బెట్టి- ఆమెకేసి తేరిపార చూసి- ఏదో గుర్తుకొచ్చినట్లయి- ఆ పెద్ద కళ్ళు- చప్పున ఆమే అంది, "నేను, నేను జ్యోతినండి!" అంది.

ఆమె కళ్ళలో నీళ్ళు తిరుగుతున్నాయి. ఉద్విగ్నతతో- తడబడుతోంది.

నేనామె చేయి పట్టుకుని, "ఏమిటి ఇక్కడా? ఎట్లా వున్నావ్?" ప్రశ్నలు.

పెండ్లి కొడుకు వాళ్ళు బంధువులట. చదువు మధ్యలోనే ఆగిపోయింది. వాళ్ళ బావతోనే పెళ్ళయింది. ఇద్దరు పిల్లలు. భర్త ఏవో చిన్నచిన్న కాంట్రాక్టులు చేస్తాడు. ఛోటామోటా రాజకీయ నాయకుడు. పాత సంగతులు తెలుసు కాబట్టి పెళ్ళాన్ని అదుపులో పెట్టుకునేందుకు ప్రయత్నాలు.

''ఏదో నడుస్తోంది,'' అంది చివరికి- పాత గాయాల మూటల్ని విప్పటం ఇష్టంలేక- నేను మాధవ ప్రస్తావన తేలేదు. ఆమె కూడా! ఎవరో వెతుక్కుంటూ వచ్చి ఆమెని పిలుస్తున్నారు. లోన షామియానాలోకి వెడుతూ ఎందుకో- వెనక్కి తిరిగి, నా వద్దకు వచ్చింది మళ్ళీ.

''ఎట్లున్నవని అడిగిౖను గదా!'' అంటూ భుజంపై వేలాడుతున్న పవిట చెంగును తొలగించి, ఎడమ చేయి ముందుకు చాచింది. ఆ చేతిపై వెలుగుతున్న దీపం బొమ్మ- పచ్చబొట్టు.

''ఇప్పుడు- ఎప్పటికీ, ఈ గుర్తు నాతోనే వుంటది,'' అంటూ వెళ్ళిపోయింది. ఆ మసక వెన్నెల్లో- నా రిక్త హస్తాల్ని చూసుకుంటూ నేను...

*పాలపిట్ట, ఏప్రిల్ 2012*



1 మే 1960న పుట్టిన విమల కవిగా ప్రసిద్ధురాలు. 15వ ఏటనే కథలు రాయటం ప్రారంభించినా, తొలికథ 1978లో నూతన మాసపత్రికలో అచ్చయింది. సుదీర్ఘ విరామం తర్వాత ఇప్పుడు కథలు రాస్తున్నారు. ఇప్పటివరకు తొమ్మిది కథలు అచ్చయ్యాయి. రెండు కవితా సంపుటాలు ప్రచురించారు. గతంలో విప్లవ రచయితల సంఘం, ప్రగతిశీల మహిళాసమాఖ్య (పిఓడబ్ల్యు)లలో పనిచేసి, ప్రస్తుతం వివిధ రంగాలలో సామాజిక కార్యకర్తగా పని చేస్తున్నారు.

***చిరునామా: 6-3-628/5, జి-4, బాసర్ అపార్ట్‌మెంట్స్, రవీంద్రనగర్, ఖైరతాబాద్, హైదరాబాద్ - 500 004.***
***ఫోన్: 9885201686 vimalamorthala@gmail.com***